
ప్రజాశక్తి
శుక్రవారం 23 డిసెంబర్ 2022
5
విజయనగరం



గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి


జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ చక్రవర్తి

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

న్యాయస్థానాల్లో వివిధ పోస్టుల భర్తీ నిమిత్తం, ప్రస్తుతం జరుగుతున్న రాతపరీక్షలకు, అభ్యర్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ చక్రవర్తి ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టుల భర్తీ ప్రక్రియ అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా జరుగుతోందని ఆయన స్పష్టం చేశారు. మధ్యవర్తులను, దళారులను నమ్మి మోసపోవద్దని, అభ్యర్థులకు సూచించారు. స్టెనో, టైపిస్టు, డ్రైవర్ పోస్టులకు ఆన్‌లైన్ పరీక్షతోపాటుగా, స్కిల్ టెస్టు కూడా జరుగుతుందని తెలిపారు. ఇతర పోస్టులు మాత్రం కంప్యూటర్ ఆధారిత ఆన్‌లైన్ టెస్టు ద్వారా భర్తీ అవుతాయని తెలిపారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్‌తో పాటు, హాల్ టిక్కెట్లో పేర్కొన్న గుర్తింపు కార్డును కూడా తీసుకురావాలని న్యాయమూర్తి సూచించారు.

మళ్లీ కరోనా కలవరం

- అప్రమత్తమైన వైద్యారోగ్య శాఖ
- ప్రతి పిహెచ్‌సిలోనూ మూడు శాంపిల్ టెస్టులకు ఆదేశం
- తొలి రోజు 144 మందికి పరీక్షలు
- జాగ్రత్తగా మెసులుకోవాలంటున్న వైద్యులు



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మళ్లీ కరోనా కలవరం మొదలైంది. ఒమిక్రాన్ సబ్ వేరియంట్ (బిఎఫ్ 7) వైరస్ వ్యాప్తి చెందుతున్నట్టు వార్తలు వస్తుండడంతో ప్రజలు కూడా ఆందోళన చెందుతున్నారు. దీంతో, వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. ప్రతి పిహెచ్‌సిలోనూ కనీసం ముగ్గురికి చొప్పున పరీక్షలు నిర్వహించాలని ఆదేశించింది. ఈ మేరకు జిల్లాలోని మొత్తం 48 పిహెచ్‌సిల్లో మొత్తం 144మందికి బుధవారం, గురువారాల్లో కరోనా పరీక్షలు నిర్వహించారు. అందరికీ నెగిటివ్ వచ్చినట్టు సమాచారం. అయినప్పటికీ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. 2019 డిసెంబర్‌లో ఫస్ట్‌వేవ్ కరోనా వచ్చిన విషయం విధితమే. మన జిల్లాలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంతో 2020 మేనెల వరకు గ్రీన్ జోన్‌లో ఉన్నాం. అనంతరం బలిజిపేట మండలం చిలకలపల్లిలో మే 20 తరువాత పాజిటివ్ కేసు నమోదైంది. అనంతరం వ్యాప్తి చెందడంతో జిల్లా అతలాకుతలమైంది. జనం భయం గుప్పెట్లో బతికారు. జనాల మధ్య సంబంధాలు తెగిపోయాయి. లాక్‌డౌన్ వల్ల నిత్యవసర సరుకులు కూడా దొరకని పరిస్థితి నెలకొంది. ఉపాధి కోల్పోవడంతో సరుకులు కొనుక్కోవడానికి డబ్బులు లేని దుస్థితి దాపురించింది. వలస కార్మికులు ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. రవాణా సేవలు స్తంభించడంతో కాలినడకన అతి కష్టం మీద ఇళ్లకు చేరుకున్నారు. ఇక రెండో దశ కరోనాలో ఒకానొక దశకు వచ్చేసరికి వైద్యసేవలు అందించలేని పరిస్థితి. బెడ్స్ దొరక్క, ఇళ్ల వద్దకు వైద్యసేవలు, మందులు అందక మరణాల పరంపర కొనసాగింది. మొత్తంగా ఇప్పటి వరకు కరోనా వల్ల జిల్లాలో 654మంది చనిపోయారు. శ్మశానాల్లో శవాల గుట్టలు కనిపించాయి. భార్యా,భర్తలు, తల్లీపిల్లలు చనిపోయారు. కడచూపునకు నోచుకోలేని పరిస్థితి ఎదురైంది. లక్షలాది మంది కరోనా భారిన పడ్డారు. ఆయా సందర్భాల్లో వైద్యసేవల కోసం చేసిన ఇప్పులు ఇప్పటికీ తీర్చుకోలేక అప్పుల ఊబిలో సతమతమౌతున్నారు. కోల్పోయిన జీవనోపాధి ఇప్పటికీ కుదుటపడలేదు. ఇటువంటి పరిస్థితుల్లో మళ్లీ కరోనా కేసులు నమోదవుతున్నాయన్న వార్తలు వినిపిస్తుండడంతో జనాల్లో భయాందోళన మొదలైంది. ఇప్పటికే దేశంలో ఒమిక్రాన్ సబ్ వేరియంట్ కేసులు నాలుగు నమోదైనట్టు వైద్యారోగ్యశాఖ ధ్రువీకరించింది. ఇందులో మన పొరుగు రాష్ట్రం ఒడిశాలో ఒకటి ఉంది. ఆ రాష్ట్రానికి ఆనుకుని విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు ఉండడంతో ఒకింత అప్రమత్తంగా వ్యవహరించాల్సివుంది. కోనసీమ జిల్లాలో కూడా ఒక కేసు నమోదైందన్న వార్త గురువారం ఉదయం నుంచే సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. ఈనేపథ్యంలో ప్రజలు కరోనా నివారణా చర్యలు పాటించాలని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

మాస్కులు ధరించి, భౌతిక దూరం పాటించాలి



దేశంలో కొత్త వేరియంట్ కరోనా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో మాస్కులు ధరించడంతోపాటు భౌతిక దూరం పాటించడం మేలు. పిహెచ్‌సిల పరిధిలో రోజుకు ముగ్గురికి చొప్పున కరోనా పరీక్షలు రెండు రోజులపాటు నిర్వహించాం. ప్రస్తుతానికి ప్రజలంతా క్షేమంగానే ఉన్నారు. కానీ, జనం అప్రమత్తంగా ఉండాలి. అసలే శీతాకాలం. ఈ సీజన్‌లో వైరస్ వ్యాప్తిచెందడానికి ఎంతో అనువుగా ఉంటుంది. వీలైనంత వరకు శానిటైజర్లు ఉపయోగించడం మంచిది.

-ఎస్‌వి రమణకుమారి,
జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి, డెంకాడ, రేగిడి

జిల్లా పర్యటనకు విచ్చేసిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు డెంకాడ మండలం నాతవలస టోల్‌గేటు వద్ద ఘన స్వాగతం లభించింది. గురువారం సాయంత్రం 3.45గంటలకు విశాఖ నుంచి రోడ్డుమార్గంలో రాజాం పర్యటనకు వెళ్తున్న ఆయనకు టిడిపి నాయకులు, కార్యకర్తలు, భారీ గజమాల, పుష్పగుచ్చాలతో ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి ఎచ్చెర్ల, రణస్థలం, చిలకపాలెం, లోలుగు, రాపాక, పొగిరి, పొందూరు జంక్షన్ ల మీదుగా చంద్రబాబు రోడ్ షో సాగింది. బాబుకు డప్పుల దరువులు, తప్పెటగుళ్ళ, పార్టీ జెండా లతో స్వాగతం లభించింది. రోడ్‌షో కు తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలకు చంద్రబాబు చేతులు జోడించి అభివాదం తెలిపారు. తెలుగు తమ్ముళ్ల హడావుడితో రోడ్ షో మొత్తం పండగ వాతావరణం నెలకొంది. రహదారి పొడవునా జనం బారులు తీరారు. ఎచ్చెర్ల, చిలకపాలెం, లోలుగు, పొందూరు జంక్షన్లలో ఘన స్వాగతం పలికారు. పొగిరి నుంచి రాజాం వరకు భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. నాతవలస వద్ద స్వాగతం పలికిన వారిలో టిడిపి నాయకులు పి.అశోక్ గజపతిరాజు, రాష్ట్ర మాజీ అధ్యక్షులు కిమిడి కళా వెంకట్రావు, విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున, పతివాడ నారాయణస్వామినాయుడు, మాజీ ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, మీసాల గీత, కెఎ నాయుడు, ఆర్‌పి భంజ్‌దేవ్, నియోజకవర్గ నాయకులు కంది చంద్రశేఖర్, కర్రోతు బంగార్రాజు, పతివాడ అప్పలనారాయణ, సువ్వాడ రవిశేఖర్, పతివాడ వెంకట శివరామ విద్యాసాగర్ నాయుడు, పతివాడ అప్పలనాయుడు పతివాడ తమ్మునాయుడు, పాణిరాజు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని జగన్ నాశనం చేశాడు

సిఎం జగన్ రాష్ట్రాన్ని నాశనం చేశారని చంద్రబాబు నాయుడు విమర్శించారు. వైసిపి నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. పొందూరు, రాజాంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ డబ్బుతో పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం దుర్మార్గమని అన్నారు. సీతారాంకు స్పీకర్‌గా కొనసాగే అర్హత లేదన్నారు. చెతపై పన్ను వేసిన. చెత్త ముఖ్య మంత్రి జగన్ అని, ఎన్నికలు ముందుగా వచ్చినా సిద్ధమేనన్నారు. రాష్ట్రంలో ఒక్కటంటే పరిశ్రమ గానీ, విద్యాసంస్థలు గాని తెచ్చుకోలేని అసమర్థ ముఖ్యమంత్రి అని దుయ్యబట్టారు. పొందూరు ఖద్దరు తయారీ కార్మికులను, చేనేత కార్మికులను ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. అచ్చెన్నాయుడును అరెస్టు చేసి, రవి కుమార్ పై కేసులు పెట్టి ఏం పీకారని అన్నారు. చదువుకున్న యువకులు ఉద్యోగాల కోసం తన వైపు చూస్తున్నారని, జాబ్ కావాలంటే బాబు రావాలని అన్నారు. రాజాం పట్టణానికి ఔటర్ రింగ్ రోడ్డు వేసి అభివృద్ధి చేస్తానన్నారు.

కిక్కిరిసిన రాజాం

రాజాంలోని బహిరంగ సభకు వచ్చిన టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడుకు తెలుగు తమ్ముళ్లు బ్రహ్మరథం పట్టారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన తెలుగు తమ్ముళ్లతో రాజాం పట్టణ ప్రధాన రహదారి కిక్కిరిసింది. బాణసంచా, డప్పుల దరువులతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, పొలిట్ బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావు, మాజీమంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు, రాజాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొండ్రు మురళీ, నాయకులు గ్రీష్మ తదితరులు పాల్గొన్నారు.

నాతవలస కూడలిలో చంద్రబాబుకు గజమాల వేసి స్వాగతం పలుకుతున్న టిడిపి నాయకులు



నాతవలస టు రాజాం రోడ్‌షో

బాబుకు బ్రహ్మరథం

ఘనస్వాగతం పలికిన టిడిపి శ్రేణులు

ఐవిపి రాజుకు చంద్రబాబు పలకరింపు

ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకున్న టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజును చంద్రబాబు పలుకరించారు. నాతవలసలో స్వాగతం పలికేందుకు వెళ్లిన ఆయనను చంద్ర బాబు పిలిచి ఆలింగనం చేసుకున్నారు. ఆరోగ్య పరిస్థితిని చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు.

సచివాలయాల సేవలు విస్తృతం

కలెక్టర్ ఎ.సూర్యకుమారి ● నారాయణపురం రేషన్ డిపో, సచివాలయం తనిఖీ

ప్రజాశక్తి-విజయనగరం



సచివాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

సచివాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు మరింతగా పెంచాలని సిబ్బందిని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. మండల ంలోని జమ్ము నారాయణ పురం గ్రామ సచివాల యాన్ని, రేషన్ డిపోను ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్నయోజన పథకం కింద లబ్ధిదారులకు అందిస్తున్న ఉచిత బియ్యం పంపిణీని పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

నారాయణ పురం సచివాలయంలో సిబ్బంది హాజరును, రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలో ప్రభుత్వ భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. పోషకాహార పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం, మెనూ అమలు, వేక్సినేషన్, ఆరోగ్య తనిఖీలపై ఆరా తీశారు. జలజీవన్ మిషన్ పనులు, నాడూ-నేడు పనులపై ప్రశ్నించారు. గ్రామంలో జరుగుతున్న జగనన్న గృహ నిర్మాణంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ గుండాల నరేష్ కోరిక మేరకు, కాలనీలో గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి రూ.5లక్షలను కేటాయించారు. వెంటనే రహదారులు వేయాలని సర్పంచ్‌ను కోరారు. రహదారులు పూర్తయిన వెంటనే ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించి, త్వరగా పూర్తి చేయాలని సూచించారు. గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగు పర్చాలని, ఎస్‌డబ్ల్యుపిసిని వినియోగంలోకి తేవాలని కోరారు. రబీ సీజనుకు ముందు పచ్చిరొట్ట వేయాలని, దీనివల్ల ఎరువుల వాడకం తగ్గుతుందని సూచించారు. అర్హులందరికీ వైఎస్‌ఆర్ బీమా వర్తింపజేయాలని చెప్పారు.

జిల్లా ప్రజలను మోసగించిన చంద్రబాబు

ఏ మొహం పెట్టుకుని మళ్లీ జిల్లాకు వచ్చారు : జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ధ్వజం

ప్రజాశక్తి-బొబ్బిలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎఎంసి చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు ; సభలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

టిడిపి అధికారంలో ఉన్నప్పుడు జిల్లా ప్రజలను అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు మోసం చేశారని, మళ్లీ ఏ మొహం పెట్టుకుని జిల్లాకు వస్తారని జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. మార్కెట్ యార్డులో గురువారం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ప్రమాణ స్వీకారానికి హాజరైన మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ టిడిపి అధికారంలో ఉన్నప్పుడు జిల్లా ప్రజలకు ఉపయోగపడే పని ఏదీ చేయలేదని ఆరోపించారు. ఎన్నికలకు మూడు నెలలకు ముందు ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తామని జిఒ ఇచ్చారే తప్ప ఆచరణలో పెట్టలేదన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టుకు ఎటువంటి అనుమతులూ లేకపోయినా శంకుస్థాపన చేశారని ఎద్దేవాచేశారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత మెడికల్ కళాశాల ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని రకాల అనుమతులు తీసుకుని శంకుస్థాపన చేసేందుకు వైసిపి ప్రభుత్వం చర్యలు చేపడితే ఎలా శంకుస్థాపన చేస్తారని అశోక్ ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు. గురజాడ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని చెప్పిన టిడిపి.. విస్మరించడంతో జెఎన్‌టియుకు గురజాడ నామకరణం చేశామని చెప్పారు. జిల్లా ప్రజలకు అన్యాయం చేసిన చంద్రబాబు ముందు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లాలో 11 వేల మంది విద్యార్థులకు రూ.70 కోట్లతో ట్యాబ్‌లు పంపిణీ చేశామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఎఎంసి నూతన పాలకవర్గం రైతులకు అందుబాటులో ఉండాలని కోరారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు మాట్లాడుతూ సొంత ఆస్తులను కాపాడుకునేందుకు రాజులు టిడిపిలోకి వెళ్లారని విమర్శించారు. రాజుల 15 ఏళ్ల పాలనలో చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. ఎఎంసి చైర్మన్‌గా బొమ్మి శ్రీనివాసరావు, వైస్ చైర్‌పర్సన్‌గా తెంటు పార్వతి, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, ఎంపిపి శంబంగి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం జరుగుతుందని జిల్లా వ్యవసాయ శాఖాధికారి వి.తారకరామారావు ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో మధ్యాహ్నం 2.45 గంటలకు జరిగే ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలిపారు.

30న డివిజన్ స్థాయి డాక్ అదాలత్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పోస్టల్ వినియోగదారుల సమస్యల పరిష్కారం దృష్ట్యా ఈ నెల 30న డివిజన్ స్థాయి డాక్ అదాలత్, ఫించన్ అదాలత్ నిర్వహించనున్నట్లు డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎ. ఈశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక హెడ్ పోస్టాఫీసు కార్యాలయంలో ఆ రోజు సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదాలత్ లు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ నెల 28వ తేదీ వరకు ప్రజల నుంచి వినతులు, విజ్ఞప్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. గడువు తర్వాత వచ్చే వినతులను పరిగణనలోకి తీసుకోబోమని తెలిపారు.



సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులకు వివరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

అవినీతికి తావులేదు

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశకి-విజయనగరంటౌన్

లంచగొండితనం లేని పాలనకు కేరాఫ్ అడ్రస్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలనని, రాష్ట్రంలో అవినీతికి తావులేదని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా. గురువారం మజ్జిపేటలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, 36వ డివిజన్ కార్పొరేటర్ బాలి పద్మావతి, నగర సహాయ కమిషనర్ ప్రసాదరావు, జోనల్ ఇన్‌ఛార్జులు బొద్దాన అప్పారావు, కుమ్మరి గుంట శ్రీనివాసరావు, కార్పొరేటర్ చందక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణ

ప్రజాశక్తి-బొబ్బిలి



నిర్మాణ పనులను అడ్డుకుంటున్న స్థానికులు

పట్టణంలోని మల్లమ్మపేట రోడ్డు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణ పనులు చేపట్టడంతో స్థానికులు అడ్డుకున్నారు. దుర్గా బార్ యజమాని రోడ్డు ఆక్రమించి నిర్మాణ పనులు చేపడుతున్నారు. దీంతో మల్లమ్మపేట గ్రామస్తులు, కొప్పల వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షులు కర్రి సత్యనారాయణ, టిడిపి నాయకులు కె.సత్యనారాయణ గురువారం అక్కడకు చేరుకుని పనులను అడ్డుకున్నారు. రోడ్డు స్థలం ఆక్రమణకు గురికావడంతో భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందని వారు తెలిపారు. అధికారులు స్పందించి సర్వే చేసి సరిహద్దులను గుర్తించి ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు.

ఆర్‌టిసి కార్మికుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఆర్‌టిసి ప్రయివేటీకరణ విధానాలను ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డిపో వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ డిపో అధ్యక్షుడు సిహెచ్ వెంకటరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వి.రాములు మాట్లాడారు. అద్దె బస్సులను దశల వారీగా రద్దు చేసి వాటి స్థానంలో ఆర్టీసీ బస్సులు వేయాలని, ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీయే నేరుగా ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. హెల్త్ కార్డులు తెచ్చి అంతంత మాత్రంగానే వైద్య సదుపాయాలు కల్పిస్తున్నారని చెప్పారు. డిపో కార్యదర్శి ఎ.చంద్రయ్య మాట్లాడుతూ పెండింగ్‌లో పెట్టిన ఒటి, నైట్ అవుట్, డే అవుట్ అలవెన్స్‌ల బకాయిలను రోజువారి బస్ క్యాష్ లో చెల్లించాలన్నారు. కార్యక్రమానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మద్దతు తెలిపారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో డిపో గౌరవ అధ్యక్షుడు కె.ఆర్.కుమార్ , ఉపాధ్యక్షులు జి.యస్.అప్పడు, సహాయ కార్యదర్శులు ఎస్.ఆర్.బాబు, బి.ఎస్.రావు, ఎస్.బి.నాయుడు, జె.ఎస్.నారాయణ, కోశాధికారి పి.వి.రావు పాల్గొన్నారు. కార్యక్రమానికి మద్దతుగా డిపో కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ అధ్యక్ష, కార్యదర్శులు అశోక్, వెంకటేష్ తో పాటు కార్మికులు పాల్గొన్నారు



నిరసన తెలుపుతున్న ఆర్‌టిసి కార్మికులు

రైస్‌మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-విజయనగరం



తనిఖీలు చేస్తున్న అసిస్టెంట్ కంట్రోలర్ జనార్దనరావు

తూనికలు, కొలతలశాఖ అసిస్టెంట్ కంట్రోలర్ ఎన్.జనార్ధన రావు, అసిస్టెంట్ కంట్రోలర్ ఎస్ఎం రాధాకృష్ణ ఆధ్వర్యాన వంగర, సంతకవిటి మండలాల్లో గురువారం రైస్ మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎలక్ట్రానిక్ స్కేల్స్ సకాలం లో ముద్రలు వేయకపోవడం వలన రెండు కేసులు, ఎలక్ట్రానిక్ స్కేల్స్, వేబ్రిడ్జిలో వ్యత్యాసం ఉన్నందున 2 కేసులు నమోదు చేశారు. రైతులు పండించిన ధాన్యం కొనుగోలులో నిర్దేశించిన బరువు కంటే అదనంగా వసూలు చేసిన, తూనికల్లో మోసాలకు పాల్పడిన మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏవైనా సమస్యలుంటే అసిస్టెంట్ కంట్రోలర్, లీగల్ మెట్రాలజీ, విజయనగరం 9398159434 నెంబరుకు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

గంజాయి తాగుతున్న ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని పలు ప్రదేశాలలో మత్తు పదార్థాలు సేవించినవారిపై వన్‌టౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. గురువారం ఎస్ఐ అశోక్ కుమార్, సిబ్బంది స్థానిక రైల్వే స్టేషన్ వద్ద గల మోటారు సైకిళ్ళ పార్కింగ్ వెనుక భాగంలో ఇద్దరు వ్యక్తులు గంజాయిని తాగుతుండగా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 350 గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వారిద్దరూ కంటోన్మెంట్ గంజిపేటకు చెందిన అక్కివరపు లక్ష్మణ్, కొప్పిలి పవన్ కుమార్‌గా గుర్తించారు. వారిని రిమాండుకు తరలిస్తున్నట్లు 1వ పట్టణ సిఐ బి. వెంకటరావు తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.



బ్యాడ్మింటన్ జట్టుకు నమూనా చెక్కును అందిస్తున్న మంత్రి రోజా

సిఎం ప్రైజ్ మనీ టోర్నమెంట్‌లో తృతీయ స్థానం

అభినందించిన సెట్విజ్ సిఇఒ చీఫ్ కోచ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ నిర్వహించిన సిఎం ప్రైజ్ మనీ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలో నెల్లిమర్ల నియోజకవర్గం మహిళల కబడ్డీ జట్టు తృతీయ స్థానం సాధించింది. ఈ నేపథ్యంలో ఆ జట్టుకు లక్ష రూపాయలు నగదుతో పాటు ట్రోఫీని రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి రోజా చేతులు మీదగా జట్టు కోచ్ సూర్యారావు, క్రీడా కారులు అందుకున్నారు. విజేతలకు జిల్లా కబడ్డీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్, కార్యదర్శి సూరిబాబు, అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు.

బ్యాడ్మింటన్‌లో విజయనగరం జోన్ బాలికలు కె.ప్రీతి(ఎస్ కోట నియోజకవర్గం) సింగిల్స్‌లో రెండో స్థానం సాధించి యభై వేలు నగదు అందుకున్నారు, డబుల్స్‌లో డి.సుధ, కల్యాణి(విశాఖ) కె.ప్రీతి (ఎస్ కోట) రెండోవ స్థానం సాధించి యభై వేలు నగదు అందుకున్నారు, డబుల్స్‌లో బాలురు ఎస్. దినేష్, డి.ఆదిత్య (విజయనగరం) మూడో స్థానం సాధించి రూ.25వేలు నగదు అందుకున్నారు. వీరంతా మంత్రి రోజా చేతుల మీదుగా జట్టు కోచ్ శ్రీనివాస్ రావు, క్రీడాకారులు ట్రోఫీని అందుకున్నారు. విజేతలను డిప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామి, ఎమ్మెల్సీ రఘురాజు, కలెక్టర్ సూర్యకుమారి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సిఇఒ దుర్గా ప్రసాద్, ముఖ్య శిక్షకులు పి.అప్పల నాయుడు అభినందించారు.

ఖోఖో విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి-విజయనగరం రూరల్

ఈనెల 17 నుంచి 19 వరకు తూర్పుగోదావరి జిల్లా కుతుకులూరులో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 17 స్కూల్ గేమ్స్ ఖో-ఖో పోటీల్లో జొన్నవలస జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వీరిని జెడ్‌పిటిసి సభ్యులు కెల్ల శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు ఈపు విజయకుమార్, పాఠశాల సిబ్బంది గురువారం అభినందించారు.

ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలని టిపిఆర్ఒ జగన్మోహనరావు కోరారు. పట్టణంలోని రాజనగర్ కాలనీ, అమ్మిగారికోనేరుగట్టు, కూరాకులవీధుల్లో జగనన్న ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పునాదులు పూర్తి చేసిన వారు గోడ నిర్మాణాలు ప్రారంభించాలని, సకాలంలో బిల్లులు చెల్లిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం

ప్రజాశక్తి- విజయనగరం కోట

తలసేమియా పిల్లల కోసం స్టూడెంట్ ఫౌండేషన్ సొసైటీ ప్రెసిడెంట్ రామగణేష్,సెక్రటరీ పవన్ ఆధ్వర్యం లో గురువారం స్థానిక కోటవద్ద గల విజయబ్లడ్ బాంక్‌లో 30 మంది యువకులు రక్తదానం చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన చైల్డ్ రైట్స్ అండ్ హ్యూమన్ రైట్స్ జిల్లా కన్వీనర్ డాక్టర్ సత్తి అచ్చిరెడ్డి మాట్లాడుతూ తలసేమియా వ్యాధిగ్రస్తులు ప్రతి 21 రోజులకు రక్తం ఎక్కించుకోవలసిన అవసరం ఉన్న పరిస్థితులలో రామగణేష్, పవన్ గత ఐదేళ్లగా ప్రతినెలా ఈ క్యాంప్ లను నిర్వహిస్తూ ఎంతోమంది పిల్లలు ప్రాణాలు కాపాడడం అభినందనీయమని అన్నారు.



సమావేశమైన ఎపిడబ్ల్యుజెఎఫ్ ప్రతినిధులు

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- మెంటాడ

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక వైకెపి కార్యాలయంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ మండల శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు, జర్నలిస్టులపై దాడులు, తదితర అంశాలపై చర్చించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఫెడరేషన్ ద్వారా కరోనా సమయంలో చేపట్టిన సేవా కార్యక్రమాలను కొనియాడారు. భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ ప్రతినిధులు గంగ్రేటి సత్యం, శివ, ఈశ్వరరావు, యు.సత్యం, కె.శ్రీనివాసరావు, జయబాబు, సురేష్, పి.సత్యనారాయణ, బి.జగదీశ్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



తుదిదశకు చేరుకున్న తహశీల్దార్ కార్యాలయ భవనం

చురుగ్గా భవన నిర్మాణం

ప్రజాశక్తి - వంగర

స్థానిక మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇటీవల ఈ నిర్మాణ పనులు నిలిచిపోవడంతో పలుమార్లు ప్రజాశక్తిలో కథనాలు వెలువయడంతో స్పందించిన ఎంపిపి ఉత్తరావిల్లి సురేష్ ముఖర్జీ చొరవతో ప్రస్తుతం పనులు ఊపందుకున్నాయి. మరో పది రోజుల్లో భవనం అందుబాటులోకి రానుండంతో సిబ్బందికి భవన సమస్య తీరనుంది.

శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని అక్కివరం గ్రామంలో ఎంపిపి బంటు వెంకటవాసుదేవరావు గురువారం అగరబత్తులు, డూప్‌టిక్స్ తయారీపై శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల్లో ఉపయోగించే పుష్పలతో అగరబత్తులు, డూప్‌టిక్స్ తయారీ, పెకింగ్ విధానం పై మహిళా సంఘ సభ్యులకు శిక్షణ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, సర్పంచులు, ఎపిఎం విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేగిడి నుంచి ర్యాలీగా...

ప్రజాశక్తి- రేగిడి

టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం సాయంత్రం రాజాంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్నొన్నారు. ఈ సభకు మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బైక్ ర్యాలీతో గురువారం తరలి వెళ్లారు. మాజీ ఎంపిపి కిమిడి రామకృష్ణం నాయుడు, మండల మాజీ అధ్యక్షులు వినయ్ కుమార్, సర్పంచ్ రవికుమార్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు రాజాం తరలివెళ్లారు.

రంగోలి పోటీల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశకి-విజయనగరంటౌన్

సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు తెలియజేయడంలో వాజీ ఛానల్ చేస్తున్న కృషి అభినందనీయమని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. వాజీ ఛానల్ ఆధ్వర్యంలో జనవరి 12 న నిర్వహించనున్న రంగోలి పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 26ఏళ్లగా వాజీ ఛానల్ కేవలం వార్తా ప్రసారాలకే పరిమితం కాకుండా, ప్రజలకు, ప్రేక్షకులకు వినూత్నప్రసారాలు అందజేస్తూ తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుందని అన్నారు. జనవరి 12వ తేదీన ఆనంద గజపతి ఆడిటోరియంలో జరిగే ఈ రంగోలి పోటీలలో 4 లక్షల 50 వేల రూపాయలు విలువ చేసే బహుమతులు ఇవ్వనుండడం విశేషం అన్నారు. మొదటి బహుమతిగా వజ్రాల హారం, రెండవ బహుమతిగా వజ్రాల చెవి దిద్దులు, మూడవ బహుమతిగా వజ్రాల ఉంగరం, మిగతా విజేతలకు వెండి కాళ్ల పట్టీలు, ఐదు గ్రాముల వెండి నాణేలు, ఫాన్సీ చీరలు, చొప్పర్, లేడీస్ టాప్స్, డబుల్ హార్స్ వారి మినప గుళ్ళు, దోశ మిక్స్ ప్యాకెట్లు, 500 రూపాయలు విలువ చేసే ఫుడ్ కూపన్స్, పోటీలలో పాల్గొనే ప్రతి ఒక్కరికి పావు కిలో స్వీట్స్ అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వాజి ఛానల్ ప్రతినిధులు కెఆర్ కె రాజు, కిషోర్, గురు ప్రసాద్, రమేష్ తదితరులు ఉన్నారు.

నేడు జాతీయ వినియోగదారుల దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం

జాతీయ వినియోగదారుల దినోత్సవ వేడుకలు స్థానిక రెవెన్యూ కళ్యాణ మండపం వేదికగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి మధుసూదనరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి, వినియోగదారుల కమిషన్ జిల్లా ప్రెసిడెంట్ ఆర్. నాగసుందర్, ఇతర సభ్యులు, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు, తదితరులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. అందరూ విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి-రామభద్రపురం



మాట్లాడుతున్న ఎస్ఐ సురేంద్రనాయుడు

గ్రామాల్లో అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సచివాలయ మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కొత్త వ్యక్తులను గమనించాలని, ఇళ్లకు తాళాలు వేసి ఉంటే వాటిపై దృష్టి సారించాలని కోరారు. చిన్న చిన్న తగాదాలను వెంటనే పరష్కరించు కొనేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల మహిళా పోలీసులు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం

ప్రముఖ భారత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గణిత దినోత్సవాన్ని గురువారం పలు పాఠశాలలు, కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఎంఆర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో రిటైర్డు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండిపి పట్నాయిక్ గణిత శాస్త్రం అభివృద్ధి, మానవాళి పెరుగుదలలో దాని ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో గణితశాస్త్ర విభాగాధిపతి ఎస్.సూరిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తోటపాలెం గాయత్రి విద్యా సంస్థల్లో శ్రీనివాస రామానుజన్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణిత ఉపకరణాలు ప్రదర్శించారు. పాఠశాల డైరెక్టర్ అల్లు ఆదినారాయణ, వెంకట నరేంద్ర, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రాంతీయ పర్యవేక్షకులు వి.శ్రీనివాసరావు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఎదురయ్యే క్లిష్ట సమస్యలను ధీటుగా ఎదుర్కొని పరిష్కారానికి ముందంజ వేయడం ఉత్తమ మైన మార్గం గణితంలో నిష్టాణాతులు కావడమేనని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన గణిత నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ బొంతు జగదీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదిత్య స్కూల్లో..

విజయనగరం టౌన్ : ఆదిత్య ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో గణితదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులగా విచ్చేసిన విజయనగరం నగర పాలక సంస్థ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, అసిస్టెంట్ కమీషనర్ పివిడి ప్రసాదరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యార్థులు చేసిన గణిత ప్రదర్శనలను తల్లిదండ్రులు వీక్షించారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెట్ అల్లు ఉమానాయుడు. అకడమిక్ ఇంఛార్జి కల్యాణి అభినందించారు.

ఫోర్ట్ సిటీ స్కూల్లో..

ఫోర్ సిటీ పాఠశాలలో ఈనెల 16 వతేదీ నుండి 22వ తేదీ రామానుజన్ పుట్టినరోజు పురస్కరించుకొని గణిత - వారోత్సవాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులకు క్విజ్, గణిత పజిల్స్, గణిత విషయానికి సంబంధిన వక్తృత్వ, వ్యాసరచన పోటీలు, సెమినార్లు నిర్వహించారు. షార్ట్ కట్ మెథడ్స్ విద్యార్థులకు గణితంలో వివరించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కెఎపి రాజు (శివ), వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపల్ గిరిజారాణి, డైరెక్టర్లు మధు, అశోక్ నీలిమ, అకాడమిక్ అడ్వయిజర్ రేయినా ఖాన్ పాల్గొన్నారు.

విజయనగరం కోట : విద్యార్థుల్లో విశ్లేషణాత్మక శక్తిని పెంచేది గణితమే అని నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు తెలిపారు.



ఆదిత్య పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను సందర్శిస్తున్న మేయర్ విజయలక్ష్మి

పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి విద్యార్థులు ఉపాధ్యాయులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు గణితం గుర్తులను ప్రదర్శించారు.

సత్య కళాశాలలో..

సత్య కళాశాలలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మొట్టమొదటిగా రామానుజన్ చిత్రపటానికి పూలమాలను వేసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘన నివాళి అర్పించారు. తరువాత కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశిభూషణరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ రామానుజన్ వంటి వ్యక్తులను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ముఖ్యఅతిథిగా క్యాంపస్ ప్లేస్మెంట్ ట్రైనర్ కె.శ్రీనివాస దయాసాగర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ఆప్టిట్యూడ్‌పై పట్టు సాధించాలని అప్పుడే ఏ ఉద్యోగానికైనా పోటీ పరీక్షల కైనా వెళ్లేటప్పుడు విజయం సాధించగలరని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి సాయి దేవమణి, గణిత శాస్త్ర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బొబ్బిలి : బొబ్బిలి పట్టణంలో గణిత దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సాయినగర్ కాలనీలో ఉన్న శ్రీచైతన్య విద్యానికేతన్, సంస్థానం, అభ్యుదయ పాఠశాలల్లో గణిత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. గణితం పట్ల విద్యార్థులు భయం వీడాలని చైతన్య పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.గౌరీశంకర్, యాజమాన్య ప్రతినిధి కొల్లి రామారావు కోరారు.

వేపాడ : మండలంలోని బికెనాయుడుపేట వద్దనున్న ఆదర్శ పాఠశాలలో రామానుజన్ చిత్రపటానికి ప్రిన్సిపల్ ఈశ్వరరావు పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన గణిత ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి.

రామభద్రపురం : మండలంలోని ముచర్లవలస ప్రాథమిక పాఠశాలలో రామానుజన్ చిత్రపటానికి ఎంఇఒ తిరుమల ప్రసాద్ పూలమాల వేసి నివాళి అర్పించారు. హెచ్ఎం ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

జామి : జామి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో హెచ్ఎం అబ్దుల్ రహమాన్ ఆధ్వర్యంలో విద్యార్థులు గణిత ప్రాజెక్టులను ప్రదర్శించారు. డ్రాయింగ్ ఉపాధ్యాయులు వై.రాము వేసిన శ్రీనివాస రామానుజన్ చిత్రపటం ఆకట్టుకుంది.

తెర్లాం : పెరుమాళి మోడల్ స్కూల్లో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి ఎంఇఒ జె.త్రినాథరావు పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం గణిత చతుర్విద ప్రక్రియలను ప్లే అండ్ లెర్న్ మెథడ్ ఆధారంగా వినూత్నంగా ప్రదర్శించారు. స్కూల్లో గణిత క్లబ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జ్యోతిలక్ష్మి పాల్గొన్నారు.

శృంగవరపుకోట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రామానుజన్ చిత్రపటానికి ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కె.వాసుదేవరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు షేక్ వలిఖాన్, శ్రీలక్ష్మి, ఈరన్న, భాస్కర్, బి.సంధ్యారాణి పాల్గొన్నారు.

నెల్లిమర్ల : బొప్పడాం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జన్మదినం సందర్భంగా జాతీయ గణిత దినోత్సవం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం నగేష్ కుమార్, పాఠశాల పిఎంసి చైర్మన్ చందక స్వామి నాయుడు శ్రీనివాస రామానుజన్ విగ్రహానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. విద్యార్థులు వందకు పైగా గణిత ప్రాజెక్ట్స్, గణిత విషయ సంబంధిత మోడల్స్‌తో ఎగ్జిబిషన్ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గణిత ఉపాధ్యాయులు ఉమామహేశ్వరి, వల్లి దేవసేన పాల్గొన్నారు.

డెంకాడ: ఎంవిజిఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శ్రీనివాస రామానుజన్ 135వ జయంతి సందర్భంగా బుధవారం జాతీయ గణిత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎల్.రాజు, గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సి.హెచ్ పూర్ణచంద్రరావు, ఇతర విభాగాధిపతులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు శ్రీనివాస రామానుజన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గుర్ల: నేషనల్ మ్యాథ్స్ డే సందర్భంగా గరివిడి అభ్యాస్ స్కూల్‌లో నిర్వహించిన అభ్యాస్ రామానుజన్ టెస్ట్‌లో తొమ్మిదవ తరగతి చదువుతున్న గుర్ల మండలం తెట్టంగి గ్రామానికి చెందిన ఆదిభట్ల విశ్వతేజ స్వరూప్ ప్రథమ స్థానంలో నిలిచారు. ఈయనతోపాటు విద్యార్థులు ఇప్పిలి లక్ష్మీ ప్రసన్న, జి. ద్రాక్షాయని ప్రథమ స్థానంలో నిలవగా ఆర్ గగన్ సాయి, శశాంక్ ద్వితీయ స్థానాలు సాధించారు. చిన్నారులను అభ్యాస్ స్కూల్ చైర్మన్ సుధీర్ ప్రశంసా పత్రం, మెమెంటో, నగదు పురస్కారాలతో సత్కరించారు.

చంద్రబాబు పర్యటనకు ఏర్పాట్లు



బొబ్బిలిలో జెండాలను సిద్ధం చేస్తున్న టిడిపి కార్యకర్తలు

ప్రజాశక్తి-బొబ్బిలి

టిడిపి అధినేత చంద్రబాబు బొబ్బిలి నియోజకవర్గంలో శుక్ర, శనివారాల్లో పర్యటించనున్నారు. రాజాం నియోజకవర్గంలో పర్యటన ముగించుకుని శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు బొబ్బిలి నియోజకవర్గంలోకి అడుగు పెట్టనున్నారు. టెక్కలివలస, పెరుమాళి, తెర్లాం, రేజేరు, పినపెంకి మీదుగా మధ్యాహ్నం 3.30 గంటలకు గొల్లపల్లి చేరుకోనున్నారు. గొల్లపల్లి వద్ద చంద్రబాబుకు భారీగా స్వాగతం పలికి మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కడికక్కడే ఫ్లెక్సీలు, పసుపు జెండాలు కట్టారు. వాటర్ ట్యాంకు వద్ద బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు బహిరంగ సభ జరగనుంది. బహిరంగ సభ అనంతరం కోటలోకి చేరుకుంటారు. మరుసటి రోజు శనివారం రైతులతో చంద్రబాబు సమావేశమవుతారు.

విజయవంతం చేయాలి

మెంటాడ : చంద్రబాబు జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షులు చలుమూరి వెంకటరావు కోరారు. మెంటాడలోని టిడిపి కార్యాలయంలో గురువారం టిడిపి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజపతినగరంలో నిర్వహించే కార్యక్రమానికి గ్రామాల నుంచి పార్టీ అభిమానులు, కార్యకర్తలు విచ్చేసి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి అరకు పార్లమెంటు ఉపాధ్యక్షులు గెద్ద అన్నవరం, కార్యదర్శి గొర్లె ముసలినాయుడు, రెడ్డి రాజగోపాల్, పిల్లి సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా పర్యటన జయప్రదం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు కడగల ఆనంద్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం చంద్రబాబు జిల్లా పర్యటన విజయవంతం చేయాలని కోరుతూ నాయకులు, కార్యకర్తలతో స్థానిక రామతీర్థం జంక్షన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24న జిల్లా కేంద్రంలో 'ఇదేమి కర్మ రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా వస్తున్న చంద్రబాబు పర్యటనకు మండలం నుంచి 5వేల మందికి తగ్గకుండా రావాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి సీనియర్ నాయకులు సువ్వాడ రవి శేఖర్, లెంక అప్ప నాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, నగర పంచాయతి పట్టణ అధ్యక్షులు బైరెడ్డి లీలావతి, అవనాపు సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రతిఒక్కరికీ లబ్ధి

ప్రజాశక్తి- రేగిడి

నవరత్నాలతో ప్రతి పేదవాడికి అన్ని రకాల పథకాలు అందించే ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గురువారం ఉప్పర నాయుడు వలస గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేవా? అనే విషయాన్ని తెలుసుకునేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా మన్నారు. అర్హులై ఉండి ఇంకా సంక్షేమ పథకాలు అందని వారికి సచివాలయాల ద్వారా అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వావిలపల్లి జగన్మోహన్‌రావు, ఎంపిటిసి కరణం గోవిందరావు, కె.శ్రీనివాసరావు, ఎంపిడిఒ జి. కాశీ విశ్వనాధరావు, డిప్యూటీ తహశీల్దార్ గోవిందరావు, ఎంఇఒ ఎం. వరప్రసాదరావు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ శ్రీ చరణ్, విఆర్ఒ సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



గడపగడపకూ వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

అవంతిలో ఘనంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు



ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి- గరివిడి

స్థానిక అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో గురువారం ఉదయం కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. జాషువ జయప్రసాద్ అధ్యక్షతన ఫ్రెషర్స్‌డే వేడుకులు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జెఎన్‌టియు రిజిస్ట్రార్ డాక్టర్ జి.స్వామినాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించుకోవడానికి కృషి చేయాలని అన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం పరుచుకోవాలని కోరారు. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధించాలని కోరారు. ఎస్ఇబి ఎఎస్‌పి అస్మా ఫర్హీన్ మాట్లాడుతూ సాంకేతిక విద్యను అభ్యసించే విద్యార్థులు క్రమశిక్షణ, ప్రణాళిక, నిబద్ధతతో చదివి ఉన్నత భవిష్యత్‌ను సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులందరకూ దిశా యాప్ ఆవశ్యకతను వివరించారు. సివిల్స్ పరీక్షల సన్నిద్ధతకు విద్యార్థుల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేశారు. గరివిడి ఎంఎస్ఎస్ పరిశ్రమ సిఇఒ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ఇంజనీర్లుగా వెలుగొంది భారతదేశ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు క్రీడా పోటీల్లో గెలిపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అవంతి ఎడ్యుకేషనల్ సొసైటీ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం.ప్రియాంక, వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఎఒ జి.అనిల్ కుమార్, వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిరోధించాలి

ప్రజాశక్తి- మెంటాడ

బాల్య వివాహాలను నిరోధించాలని జిల్లా సామాజిక, పరివర్తన సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయ అధికారి బి.రామకృష్ణ కోరారు. గురువారం మండలంలోని పోరాం గ్రామంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. లింగ వివక్ష, బాల్య వివాహాల నిర్మూలన, జంక్‌ఫుడ్ వల్ల కలిగే ప్రమాదాలు, రక్తహీనతను అధిగమించడం ఎలా? పౌష్టికాహారం, మంచి అలవాట్లు, ఉన్నత లక్ష్యాలు తదితర అంశాల గురించి వివరించారు. బాల్యంలోనే గర్భం దాల్చిన వారిలో 59 శాతం మంది మహిళలు కేవలం రక్తహీనతతో మరణిస్తున్నారని వివరించారు. అలాంటి మరణాలు జరగకుండా అడ్డుకట్ట వేయాలంటే బాల్యవివాహాలను నిర్మూలించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అబ్బాయి, అమ్మాయిల మధ్య లింగ వివక్ష ఉండకూడదన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అమ్మాయిల వివాహ కనీస వివాహ వయస్సు 21 ఏళ్లకు పెంపుదల చేస్తూ పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశ పెట్టిందన్నారు. ఈ బిల్లు ఆమోదం పొందితే అమ్మాయిలు 21 ఏళ్ల తరువాతే వివాహం చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 112 నంబరుకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



బోల్తా పడిన ఆటో

ఆటో బోల్తా

- విద్యార్థులకు తీవ్ర గాయాలు
- ముగ్గురి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-మెరకముడిదాం



చికిత్స పొందుతున్న విద్యార్థులు

మండలంలోని సోమలింగాపురం, పాలెం గ్రామాల మధ్య ఆటో బోల్తా పడిన ఘటనలో ముగ్గురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. మెరక ముడిదాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పాలెం గ్రామానికి చెందిన విద్యార్థులు గురువారం సాయంత్రం పాఠశాల విడిచి పెట్టిన తరువాత మెరక ముడిదాం నుండి పాలెం గ్రామానికి ఆటోలో వెళ్తుండగా బోల్తాపడింది. దీంతో యు. దినేష్, ఆర్. రేవంత్, జి. జగన్, జి దిక్షిత, పి. ఇందుకు తీవ్ర గాయాలు అవ్వడంతో వెంటనే 108వాహనం ద్వారా చీపురుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడనుండి వీరిని మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. అయితే వీరిలో దినేష్, రేవంత్, జగన్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.



తాగునీటి ట్యాంకును ప్రారంభిస్తున్న ఎంపిపి సత్యవంతుడు

వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జాకేరు గ్రామంలో వెల్‌నెస్ సెంటర్, తాగునీటి ట్యాంకును గురువారం ఎంపిపి దొగ్గ సత్యవంతుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, నాయకులు బుద్ధ అప్పలనాయుడు గ్రామస్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ మండలంలో పంచాయతీని ముందువరుసలో నిలుపుతున్నారని తెలిపారు. వీరి సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, ఎంపిటిసి పివి రమణ, వైసిపి మండల అధ్యక్షుడు ఎం.జగ్గుబాబు, బిసి సెల్ జిల్లా అధ్యక్షులు ఎం.సత్యనారాయణ, చామలపల్లి సర్పంచ్ కోలా రమేష్, గుడివాడ సర్పంచ్ గోపి, బొడ్డు శ్రీను, ఎఎన్ఎం లక్ష్మి, ఎంఎల్‌హెచ్ పి.రమ్య. ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, నాయకులు బుద్ధ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి ప్రభుదాసు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వాలీబాల్ సబ్ జూనియర్ టీమ్‌కు ఎంపిక

ప్రజాశక్తి- గరివిడి

జిల్లా వాలీబాల్ సబ్ జూనియర్ టీమ్‌ను ఈనెల 18న జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. ఈ ఎంపికలకు గరివిడి పట్టణానికి చెందిన పలువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. వీరందరికీ ప్రత్యేకంగా ఈనెల 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు కోచింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈ టీమ్‌కు కోచ్‌లుగా ఎం. గోపాలరావు, సిహెచ్. సాంబమూర్తి రాజు, వ్యవహరించి శిక్షణ అందించారు. ఈ శిక్షణకు అవసరమయ్యే ఆర్థిక సహాయాన్ని జెడ్‌పిటిసి వాకాడ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ బమ్మిడి అప్పలస్వామి, సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు ఎం గోవిందు, ఎం వరుణ్ రాజ్, ఎం మోహన్, జి అప్పారావు అందించారు. ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు జరుగు అంతర్ జిల్లా వాలీబాల్ పోటీలలో ఈ టీమ్ పాల్గొంటుందన్నారు.